ఎన్నాళ్లీ ఎదురు చూపులు ?



- నూతన పింఛన్లు, రేషన్‌కార్డుల కోసం అవస్థలు
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అర్హులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

గుడిబండ: దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వృద్ధులు, భర్త చనిపోయిన వితంతువులు.. నడవలేని దివ్యాంగులు.. ప్రభుత్వం మంజూరు చేసే సామాజిక పింఛన్ల కోసం అవస్థలు పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లోని సచివాలయ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొత్త పింఛన్లు ఇంకా ఇవ్వడంలేదని, మళ్లీ రావాలని సచివాలయ ఉద్యోగులు చెబుతుండడంతో అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సులువుగా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పింఛన్లు, రేషన్‌కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగేది. ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి అర్హులతో దరఖాస్తులు స్వీకరించేవారు. అర్హతను బట్టి ఆ వెంటనే రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు అయ్యేవి. అయితే నేడు ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు గడచినా నూతన పింఛన్లు, రేషన్‌కార్డుల గురించి మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. కేవలం ప్రజాప్రతినిధులు మాటలు మాత్రమే చెబుతున్నారు. అదిగో.. ఇదిగో అంటూ కాలం గడిపేస్తున్నారు. పింఛన్లు, రేషన్‌కార్డుల కోసం ప్రస్తుత ప్రభుత్వం ఇంకా సైట్ ఓపెన్ చేయకుండా కాలయాపన చేస్తోంది. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే క్రమంలో నిత్యం సచివాలయాల చుట్టూ తిరగలేకపోతున్నామని ఆయా ప్రాంతాల వాసులు వాపోతున్నారు. అంతే కాకుండా కొత్తగా వివాహం చేసుకున్న వారు రేషన్‌కార్డు దరఖాస్తు చేసుకునేందుకు ఎదురు చూస్తున్నారు. ఆఖరికి రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులకు సైతం వీలులేకుండా ఉండటంతో లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారు.

పింఛన్‌కు 369, రేషన్‌కార్డులకు 336 అర్జీలు

ఇటీవల ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం రెవిన్యూ సదస్సులు నిర్వహించింది. గ్రామ గ్రామానా సమావేశాలు నిర్వహించి అర్జీలు స్వీకరించారు. అయితే భూ సమస్యల కంటే రేషన్‌కార్డులు, పింఛన్ల కోసం ఎక్కువగా అర్జీలు అందాయి. ఒక్క గుడిబండ మండలంలోనే పింఛన్ల కోసం 369 మంది, రేషన్‌కార్డుల కోసం 336 మంది అర్జీలు అందించారు. అర్జీలనైతే అధికారులు స్వీకరించారుగాని పరిష్కారం చూపలేదని జనం వాపోతున్నారు.

'అధికారంలోకి రాగానే నూతన పింఛన్లు మంజూరు చేసి అర్హులందరికీ న్యాయం చేస్తాం. పేదలకు రేషన్‌కార్డులు ఇచ్చి అండగా ఉంటాం' అంటూ ఎన్నికల ముందు కూటమి నాయకులు అన్ని చోట్లా ఊదరగొట్టారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు గడుస్తున్నా హామీల అమలుపై మాత్రం దృష్టి పెట్టడం లేదు.



సచివాలయం చుట్టూ తిరుగుతున్నా..



నేను, నా భర్త రోజువారి కూలి పనిచేసుకుని బతుకునేవాళ్లం. మాకు ఇద్దరు పిల్లలు. అయితే నా భర్త హనుమంతరాయప్ప అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఈ నేపథ్యంలో వితంతు పింఛన్ కోసం తొమ్మిది నెలలుగా సచివాలయం చుట్టూ తిరుగుతున్నాను. నేటికీ ఏ ఒక్క అధికారి పట్టించుకోలేదు. భర్తను పోగొట్టుకున్న నేను ఇద్దరు పిల్లలతో జీవనం సాగించడం కష్టంగా ఉంది. ఇప్పటికైనా నాకు అధికారులు పింఛన్ వచ్చేలా చూడాలి.

– లక్ష్మమ్మ, ఫశారం గ్రామం, గుడిబండ మండలం

ప్రభుత్వం సైట్ ఓపెన్ చేస్తే అందరికీ పరిష్కారం

ఎన్నికల నోటిఫికేషన్‌తో గత ఏడాది ఏప్రిల్ 18 నుంచి ప్రభుత్వ సైట్ ఓపెన్ కాలేదు. దీనివల్ల పింఛన్ దరఖాస్తు చేసుకునేందుకు అలాగే నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మార్చి నెలలోపు సైట్ ఓపెన్ చేస్తారని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ సైట్ ఓపెన్ అయితే పింఛన్, రేషన్‌కార్డులకు అందరూ దరఖాస్తు చేసుకోవచ్చు.

– గంగాధర్, ఎంపీడీఓ, గుడిబండ

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

పెనుకొండ రూరల్: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సృజన్ బాబు వివరాల మేరకు.. సిబ్బందితో కలిసి సోమవారం వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఇందులో భాగంగానే గోరంట్ల మండలంలోని పెరుమాళ్ల క్రాస్ వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని గుర్తించామన్నారు. రెండు ద్విచక్ర వాహనాలు, 192 హైవార్డ్స్ 90 ఎంఎల్ మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గోరంట్ల మండలం చలమయ్యగారిపల్లికి చెందిన రమేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మరో ముద్దాయి అయిన గోరంట్లకు చెందిన వేణు పారిపోయినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎస్ఐ రాముడు, హెడ్ కానిస్టేబుల్ బుచ్చయ్య, రామచంద్ర, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ టీచర్ మృతి



లక్ష్మీదేవమ్మ (ఫైల్)



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు

హిందూపురం టౌన్: పట్టణంలోని బోయపేటకు చెందిన అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీదేవమ్మ సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న అధికారులు, సిబ్బంది, సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు లక్ష్మీదేవమ్మ మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, సీఐటీయూ పట్టణ కన్వీనర్ వీఆర్ రాము, ప్రాజెక్ట్ కార్యదర్శి శోభారాణి, అధ్యక్షురాలు అరుణ మాట్లాడారు. ఆరు నెలలు కాల వ్యవధిలో నలుగురు అంగన్‌వాడీ వర్కర్లు చనిపోయారన్నారు. అయితే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేకపోవడం బాధాకరమన్నారు. మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వచ్చేలా చర్యలు తీసుకొని బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సభ్యులు శైలమ్మ, నాగమ్మ, శిరీష, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తనిఖీ బృందానికి సహకరించండి

అగళి: మండలంలోని 18వ విడత సామాజిక తనిఖీ బృందం సభ్యులకు రైతులు, కూలీలు సహకరించాలని ఎస్ఆర్పీ ఆవులయ్య సూచించారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి సిబ్బంది, సామాజిక తనిఖీ బృందంతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆవులయ్య మాట్లాడుతూ... ఉపాధి పథకం ద్వారా 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకూ 555 పనులకుగాను రూ.4.14 కోట్ల ఖర్చు, మెటీరియల్‌కు రూ.88 లక్షల ఖర్చు పెట్టారన్నారు. పనులు సక్రమంగా ఉన్నాయా లేదా అన్న విషయాన్ని నేటి నుంచి తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు తయారు చేస్తుందన్నారు.

మునిమడుగు బాధితురాలికి పరామర్శ



బాధితురాలు వెంకటలక్ష్మిని పరామర్శిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన వివాహితపై దాడి ఘటనలో బాధితురాలు మునిమడుగు గ్రామానికి చెందిన వెంకటలక్ష్మిని మంత్రి సవిత సోమవారం ఉదయం పరామర్శించారు. దాడి చేసి జుత్తు కత్తిరించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. నిందితులు ఏ పార్టీ వారైనా కఠినమైన చర్యలు తీసుకొంటామన్నారు. ఇప్పటికే 11 మందిని పోలీసులు అరెస్ట్ చేశారని, మిగిలిన 9 మందిని కూడా త్వరలో పట్టుకొనేలా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారన్నారు.

గొర్రెల అపహరణ

పరిగి: మండలంలోని శాసనకోటలో చిన్న ఓబులప్పకు చెందిన 10 గొర్రెలను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఇంటి నుంచి గొర్రెలను ఎత్తుకెళ్లారు. తనకున్న 15 గొర్రెలలో చిన్న గొర్రెలు మినహా పెద్ద గొర్రెలను దుండగులు అపహరించారని, వాటి విలువ దాదాపు రూ.లక్ష ఉంటుందని బాధితుడు చిన్న ఓబులప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై సోమవారం పరిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

పగిలిన పైప్‌లైన్



ముక్కిడిపేట వద్ద వృథా అవుతున్న నీరు

హిందూపురం: పట్టణంలోని ముక్కిడిపేట వేణుస్కూల్ వద్ద పైప్‌లైన్ పగిలిపోవడంతో నీరంతా వృథా అయింది. పది నిముషాలు అధికంగా కొళాయిలకు నీళ్లు వదలరు గాని నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోరా? అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీగా నీళ్లు వృథాగా అయిన తర్వాత నీటిని బంద్ చేశారన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలని వినతి

హిందూపురం: తక్షణం ఎస్సీ వర్గీకరణ చేయాలని ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రాను వినతిపత్రం అందజేసినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గంగాద్రి, జిల్లా అధికార ప్రతినిధి గంగాధరప్ప, ఉపాధ్యక్షుడు అధ్యక్షుడు నాగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించామన్నారు.

రొళ్ల: ఎస్సీ వర్గీకరణ చేపట్టి ఏబీసీడీలుగా విభజించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లో ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రాను కలిసి వినతిపత్రం సమర్పించామన్నారు.

45 మంది ఉద్యోగాలకు ఎంపిక



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురం ఎల్వీ ప్రసాద్ కంటి పరీక్ష కేంద్రంలో వివిధ ఉద్యోగాల ఎంపిక కోసం సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో భాగంగా 45 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ఆస్పత్రి ఏరియా కోఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. కంటి పరీక్ష కేంద్రాన్ని మడకశిర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శివమాల స్వీకరణ

మడకశిర: పట్టణంలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివమాల స్వీకరణ మహోత్సవం వైభవంగా జరిగింది. పురోహితుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని శివ భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నియోజకవర్గంలోని వందలాది మంది శివ భక్తులు మాలలు ధరించారు.

మృతులకు నివాళి



గొల్లపల్లిలో లక్ష్మమ్మమృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న చరణ్‌రెడ్డి

పెనుకొండ రూరల్: మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యనారాయణరెడ్డి తల్లి లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి సోమవారం ఆ గ్రామానికి వెళ్లారు. లక్ష్మమ్మ మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అలాగే దుద్దేబండ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోయ రామస్వామి తల్లి లక్ష్మమ్మ మృతి చెందడంతో మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహులు, సుధాకర్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, షైశాలి జయశంకర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి,వె వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తిరుమణిలో జోరుగా జూదం

పావగడ: తాలూకాలోని తిరుమణి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిరుమణి గ్రామ పరిసర ప్రాంతాలలో ఎడ్డాట (బొమ్మా బొరుసు) జూదం జోరుగా సాగుతోంది. అక్కమ్మ గార్ల దేవాలయం, కర్ణాటక సరిహద్దులోని రామగిరి మండలానికి చెందిన కానుగులకుంట ప్రాంతాల్లో రోజూ జూదం సాగుతోందని స్థానికులు చెబుతున్నారు. లక్షలాది రూపాయలు బెట్టింగ్ జరుగుతోందంటున్నారు. కూలి పనులతో సంపాదించిన డబ్బు జూదాలకు తగలబెడుతున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. తిరుమణి పోలీసులు జూదాలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

బాల్య వివాహాల కట్టడికి కృషి

పెనుకొండ: బాల్య వివాహాలు అరికట్టేందుకు సమతా స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తుందని, నీతి ఆయోగ్ ఏవీఏ (అసోసియేషన్ ఆఫ్ వాలంటీర్ యాక్షన్) సహకారం కూడా ఉంటుందని ఆ సంస్థ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. సమతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం బాల్య వివాహాల నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. చిన్నారులను బడి బయట లేకుండా విద్యకు ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు చేపట్టాలని, నైపుణ్య అభివృద్ధి అవకాశాలను పెంపొందించాలన్నారు.

ప్లేట్లు, గ్లాసుల వితరణ

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రొద్దం మండలం బొక్సంపల్లి గ్రామానికి చెందిన రఘునాథ్‌రెడ్డి, కాంతమ్మ దంపతులు 500 ప్లేట్లు, 400 గ్లాసులు మధ్యాహ్న భోజనం కోసం సోమవారం వితరణ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రిన్సిపాల్ సుదర్శన్, ఉమాశంకర్, హఫీజ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

గోరంట్ల: రోడ్డు వారోత్సవాల్లో భాగంగా సోమవారం ట్రాఫిక్ నిబంధనలపై సీఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు, ఎస్ఏపీఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, పోలీసులు పాల్గొన్నారు.

23న మండల మీట్

లేపాక్షి: స్థానిక స్త్రీ శక్తి భవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ వెంకటరత్నమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

అర్జీలను పరిష్కరించండి

రొళ్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి వీఆర్వోలు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పరిష్కార వేదికకు 4 అర్జీలు వచ్చాయన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మడకశిర రూరల్: మండలంలోని గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి సూచించారు. కల్లుమర్రి పీహెచ్‌సీ పరిధిలోని బుళ్లసముద్రంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని సోమవారం ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. డాక్టర్ మాధుర్య, సూపర్ వైజర్ సరస్వతి, ఏఎన్ఎం శశికళ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు నివారణపై అవగాహన

అగళి: కుష్టు వ్యాధి నివారణలో భాగంగా మండల కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ గాయత్రి, సూపర్ వైజర్ నర్సారెడ్డి, జయమ్మ, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, ఏఎన్ఎం శైలజ తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామికి జ్యోతులు



ఓబుళాపురంలో జ్యోతులు మోస్తున్న భక్తులు

లేపాక్షి: మండలంలోని ఓబుళాపురంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామికి గ్రామస్తులు సోమవారం జ్యోతులు మోశారు. నూతనంగా దేవాలయం నిర్మించిన సందర్భంగా ఈ ఉత్సవం నిర్వహించారు. సర్పంచ్ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

రేపు చేపల చెరువు వేలం

లేపాక్షి: మండలంలోని శిరివరం గ్రామ సచివాలయంలో బుధవారం ఉదయం 11.30 గంటలకు శిరివరం–మానేపల్లి చెరువులో ఉన్న చేపలను పట్టుకునేందుకు సర్పంచ్ నేత్రావతి అధ్యక్షతన వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓఆర్డీ ఆనందకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

రొళ్ల: అంగనవాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్యాభ్యాసం కోసం తల్లిదండ్రులు క్రమం తప్పకుండా చిన్నారులను సెంటర్‌కు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని రొళ్ల క్లస్టర్ పరిధిలోని 22 అంగనవాడీ కేంద్రాలకు పాఠ్యపుస్తకాలను కార్యకర్తలకు పంపిణీ చేశారు.

బేడీ మృతి విచారకరం

పెనుకొండ: యంగ్ ఇండియా అధినేత నరేంద్రసింగ్ బేడీ మృతి విచారకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. పెనుకొండ కేంద్రంగా యంగ్ ఇండియా అనే పేరుతో అనేక సామాజిక కార్యక్రమాలను చేపట్టారన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకం అమలు చేయడంలో విశేషంగా కృషి చేశారన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

లేపాక్షి: మండలంలోని కొండూరు గ్రామంలో రెడ్డి కులస్తులకు శ్మశానానికి స్థలం కేటాయించాలని ఆ గ్రామానికి చెందిన రెడ్డి కులస్తులు తహసీల్దార్ సౌజన్యలక్ష్మికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో 300 రెడ్డి కుటుంబాలు ఉన్నాయని, రెండు ఎకరాలు భూమిని కేటాయించాలన్నారు.

దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ

హిందూపురం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇల్లు లేని నిరాశ్రయులకు లైఫ్ వరల్డ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఉదయ్‌కుమార్, మిత్ర మండలి ఆధ్వర్యంలో సోమవారం దుప్పట్లు, స్వెటర్లు అందజేశారు. కార్యక్రమంలో మనోజ్, మాజీ కౌన్సిలర్ రామ్మూర్తి, బన్ని, శివ, మిషన్ కాంపౌండ్ చర్చి యూత్ శ్యామ్‌బాబు, ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తి రక్షణ చట్టం తీసుకురావాలి

హిందూపురం టౌన్: తమ పొట్ట కొడుతున్న కార్పొరేట్ సెలూన్ షాపులను అడ్డుకునేలా ప్రత్యేక కులవృత్తి రక్షణ చట్టం తీసుకురావాలని నాయీ బ్రాహ్మణులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం సవిత మహర్షి నాయి బ్రాహ్మణ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు.

ఇళ్లు ప్రారంభించిన స్పెయిన్ దేశస్తులు

మడకశిరరూరల్: ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇళ్ల సౌకర్యం కల్పించి వారి జీవితాల్లో వెలుగు నింపడమే ఆర్డీటీ సంస్థ లక్ష్యమని ఆ సంస్థ ఆర్డీ మల్లికార్జున తెలిపారు. మండల పరిధిలోని వైబీ హళ్లి ఎస్సీ కాలనీలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్మించిన 37 నూతన గృహాలను సోమవారం స్పెయిన్ దేశస్తులు ప్రారంభించారు. ఆర్డీ రఘురామ్, ఇంజనీర్ రంగనాయకులు, సీడీసీ సభ్యులు యోగానంద్, ఉమాదేవి, హనుమంతరాయప్ప, రంగనాథ్ పాల్గొన్నారు.

గుజరీ షెడ్డుకు నిప్పు



కాలిపోతున్న షెడ్డు

హిందూపురం అర్బన్: స్థానిక ఆటోనగర్ క్రాస్‌లో సోమవారం తెల్లవారు జామున రోడ్డు పక్కన ఉన్న రేకులషెడ్డు అగ్నికి ఆహుతైంది. బాబా ఫక్రుద్దీన్ అనే వ్యక్తి షెడ్డులో గుజరీ వ్యాపారం నిర్వహించేవారు. తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు షెడ్డుకు నిప్పు పెట్టడంతో అందులో ఉన్న వస్తువులన్నీ కాలిపోయాయని బాధితుడు బాబా ఫక్రుద్దీన్ వాపోయారు. అగ్ని ప్రమాదం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే వచ్చి మంటలు ఆర్పారు. అయితే అప్పటికే వస్తువులన్నీ కాలిపోయాయి.

మహిళా సంఘాల పని తీరుపై సమీక్ష

అమరాపురం: మండలంలోని మహిళా సంఘాల పని తీరుపై ఏపీఎం ముత్యాలప్ప ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. ఏరియా కో ఆర్డినేటర్ నాగరాజు మాట్లాడుతూ సంఘాల్లో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా చూసే బాధ్యత వీఓ లీడర్లు, సీసీలదేనన్నారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు

గుడిబండ: మండల పరిధిలోని హిరేతుర్పిలోని బస్టాండ్ ఆవరణలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. వాల్మీకి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంతో ఈరలక్కప్ప మాట్లాడుతూ వాల్మీకి చెడు నుంచి మంచికి మారి మహర్షి అయ్యారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని వాల్మీకులు కూడా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కుంచిటిగ వక్కలిగ సంఘం తాలుకా అధ్యక్షుడు రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు, భూతరాజు, అమరాపురం మాజీ జెడ్పీటీసీ ఉగ్రప్ప, మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు, సర్పంచ్ గౌరమ్మ, శివన్న, నాయకులు తమ్మన్న, గిరియప్ప, లోకేష, రఘు, దాసన్న, బోజేగౌడు, నాగు, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తికి పాదయాత్ర



రొద్దం నుంచి పుట్టపర్తికి కాలినడకన వెళుతున్న సాయి భక్తులు

రొద్దం: మండల కేంద్రమైన రొద్దం నుంచి పుట్టపర్తిలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకునేందుకు పలువురు భక్తులు కాలినడకన వెళ్లారు. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ తర్వాత సాయి కీర్తనలు ఆలపిస్తూ, భజనలు చేసుకుంటూ పుట్టపర్తి వెళ్తుంటామని, ఇందులో భాగంగానే పుట్టపర్తికి వెళ్తున్నట్లు భక్తులు తెలిపారు.

భూములు కోల్పోయిన రైతులను ఆదుకోండి

సోమందేపల్లి: మండలంలోని నాసన్, బెల్ పరిశ్రమలకు భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవాలని ప్రజాదర్బార్‌లో మంత్రి సవితకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు స్వర్ణలత సోమవారం వినతిపత్రమిచ్చారు. వెలుగు కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించగా.. ఆర్‌అండ్‌ఆర్ ప్రాజెక్టు కింద పరిహారం అందించాలని రూ.10 కోట్లు అవసరమైనట్లు అధికారులు నివేదికలు పంపారని, ఆ నిధులు విడుదల చేయించాలని కోరారు. పేదలకు ప్రభుత్వ భూముల్లో ఇంటి పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆర్డీఓ ఆనంద్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ నరేంద్ర ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హిమోదయం



పరిగి: ఉదయం 8 గంటల సమయంలో సూర్యోదయం ఇలా..

హిందూపురం/మడకశిర/పరిగి: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాలను పొగమంచు కమ్మేసింది. సోమవారం 9 గంటలైనా చాలా ప్రాంతాల్లో పొగ మంచు తీవ్రత తగ్గలేదు. ఉదయమే పనులకు వెళ్లే వారు చలికి వణికిపోయారు. చలికి వృద్ధులు, చిన్న పిల్లలు బయటకు రాలేకపోయారు.



హిందూపురం: చైతన్యనగర్ రోడ్డులో..



మడకశిరలో ప్రధాన రహదారిని కమ్మేసిన పొగమంచు



పరిగి గ్రామంలో ఇళ్ల మధ్య పొగ మంచు



మంచుపొగతో నిండిన హిందూపురం ఎంజీఎం గ్రౌండ్